ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే తెల్లం

ప్రెస్‌క్లబ్‌ను ప్రారంభించి మాట్లాడుతున్న భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

చర్ల, మార్చి 30: చర్లలో 'స్వేచ్ఛ ప్రెస్‌క్లబ్'ను ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు శనివారం ప్రారంభించారు. సీనియర్ పాత్రికేయుడు సీఎల్ నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ గీద కోదండరామయ్య తదితరులు పాల్గొన్నారు.

'దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి నుంచే ఓటు'

చుంచుపల్లి, మార్చి 30: వీల్‌చైర్‌కే పరిమితమైన దివ్యాంగులు, 85 ఏళ్లు దాటిన వృద్ధులు ఈ పార్లమెంటు ఎన్నికల్లో కూడా తమ ఇంటి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చునని తహసీల్దార్ కృష్ణ శనివారం తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మండలంలోని వివిధ పోలింగ్ బూత్‌ల్లో అర్హులను గుర్తిస్తున్నామని, వారికి 12డీ ఫారాలను పంపిణీ చేస్తున్నామని అన్నారు. అర్హులు వచ్చే నెల 23లోగా ఆయా ఫారాలను పూర్తిచేసి బీఎల్‌వోలకు అందించాలని సూచించారు.

బాల్యం వివాహంపై పోలీసులకు ఫిర్యాదు

అశ్వారావుపేట, మార్చి 30: పెళ్లి వేడుకల్లో చోటుచేసుకున్న ఘర్షణతోబాల్యం వివాహం విషయం బహిర్గమైంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ఒక గ్రామంలో ఈ నెల 27న ఓ వివాహం జరిగింది. అందుకుగాను సదరు కుటుంబ సభ్యులు శుక్రవారం విందు ఏర్పాటు చేశారు. ఈ విందులో మాంసం కూర వేయలేదంటూ నిర్వాహకులతో ఒక వ్యక్తి వాగ్వాదానికి దిగాడు. అది కాస్తా ఘర్షణకు దారి తీసింది. ఆ వ్యక్తిపై నిర్వాహకులు దాడి చేశారు. ఈ క్రమంలో ఆ వివాహంలోని వధువు మైనర్ అనే విషయం వెలుగు చూసింది. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ.. ఈ బాల్య వివాహంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అయితే బాల్య వివాహంపై తమ ఫిర్యాదు అందిందని, దానిని పరిశీలిస్తున్నామని ఏఎస్సై రహ్మాన్ తెలిపారు.

బెల్టు షాపులపై దాడులు.. మద్యం స్వాధీనం..

మద్యం బాటిళ్లు చూపుతున్న పోలీసులు

అశ్వారావుపేట, మార్చి 30: ఎన్నికల కోడ్ దృష్ట్యా పలు బెల్టు షాపులపై శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో పోలీసులు, ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. మండలంలోని వినాయపురం, నారంవారిగూడెం, కొత్త మామిళ్లవారిగూడెం గ్రామాల్లోని బెల్టు షాపులపై స్క్వాడ్ అధికారి ఎల్ కృష్ణ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి రూ.39,450 విలువ గల 255 బీర్లు, మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరరావు తెలిపారు. దాడిలో స్క్వాడ్ బృందం, ఎక్సైజ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వెయ్యి లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

బెల్లం పానకాన్ని పారబోస్తున్న అధికారులు

కొత్తగూడెం క్రైం, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో నాటు సారా, గంజాయి తయారీ–రవాణాపై ఆబ్కారి అధికారులు దృష్టి సారించారు. జిల్లా ఆబ్కారి అధికారి జానయ్య ఆధ్వర్యంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ కరంచంద్, అధికారులు కలిసి కొత్తగూడెం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రుద్రంపూర్ తండా, రామవరం, చుంచుపల్లి తండా, సర్వారం, కాకర్ల ప్రాంతాల్లో దాడులు నిర్వహించారు. 12 లీటర్ల నాటు సారా స్వాధీనపర్చుకున్నారు. దాని తయారీకి సిద్ధం చేసిన వెయ్యి లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సాంబమూర్తి, కొత్తగూడెం ఎక్సైజ్ సీఐ ఎల్.జయశ్రీ, పాల్వంచ సీఐ ప్రసాద్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆసుపత్రిని తనిఖీ చేసిన జాతీయ బృందం

ఆసుపత్రి వద్ద కేంద్ర బృంద బాధ్యులు, వైద్యులు

చంద్రుగొండ, మార్చి 30: మండల కేంద్రమైన చంద్రుగొండలోని ప్రభుత్వ ఆసుపత్రిని జాతీయ నాణ్యతా ప్రమాణాల బృంద బాధ్యులు శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను, వార్డులను పరిశీలించారు. అందుతున్న వైద్యం సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశమయ్యారు. ల్యాబ్, వార్డుల పనితీరుపై సంతృప్తిని వ్యక్తం చేశారు. బృందంలో సభ్యులు నారాయణ, బాలకృష్ణ, డీఐవో బాలాజీ, వైద్యులు స్పందన ఉన్నారు. స్థానిక వైద్యులు వెంకటప్రకాశ్, శృతి, నాగభూషణం, శోభ, లక్ష్మి, చంద్రకళ, ఇమామ్, పద్మ, కిరణ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds
WANTED
★Experienced Supervisors Needed.
1 year of Waterproofing Experience Required. Contact: Jaya Bharathi Constructions at 8790508663.
NT-10287-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు వెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఉగాది కవితా పోటీలు

పాల్వంచ, మార్చి 30: ఉగాది కవిత పోటీలకు కవితలను ఆహ్వానిస్తున్నట్లు పాల్వంచ కళాపరిషత్, ఉగాది ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీల కరపత్రాన్ని వారు శనివారం పాల్వంలో ఆవిష్కరించారు. కవితలను వచ్చే నెల 5వ తేదీ లోపు 98498 90322 నంబర్‌కు పంపాలని కోరారు.

సీఈలకు వినతి

పాల్వంచ, మార్చి 30: కేటీపీఎస్‌లో కారుణ్య నియామకాల దరఖాస్తులను పునరుద్ధరించాలని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (హెచ్ 147) నాయకులు కోరారు. ఈ మేరకు కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావులను శనివారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

పాల్వంచ రూరల్, అశ్వారావుపేట టౌన్, చండ్రుగొండ మండలాల్లో పరీక్షలు ముగించుకొని పరీక్షా కేంద్రాల వద్ద కేరింతలు కొడుతున్న పదో తరగతి విద్యార్థులు

ముగిసిన టెన్త్ పరీక్షలు.. విద్యార్థుల కేరింతలు..

కొత్తగూడెం ఎడ్యుకేషన్/ అశ్వారావుపేట టౌన్/ చండ్రుగొండ/ పాల్వంచ రూరల్, మార్చి 30: జిల్లాలో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల 18న ప్రారంభమైన ఈ పరీక్షలు శనివారంతో పూర్తయ్యాయి. అవకతవకలు, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా చివరి రోజు రెగ్యులర్ విద్యార్థులు 12,341 మందికి గాను 12,289 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 58 మందికి గాను 48 మంది హాజరయ్యారు. పది మంది గైర్హాజరయ్యారు. డీఈవో ఐదు సెంటర్లను, ఫ్లయింగ్ స్క్వాడ్ 27 సెంటర్లను, జిల్లా పరిశీలకులు ఐదు సెంటర్లను పరిశీలించారు. మాస్ కాపీయింగ్ కేసులు ఎక్కడా నమోదు కాలేదు. అయితే, ఇన్ని రోజులూ పుస్తకాలతో కుస్తీ పట్టి పరీక్షల్లో నిమగ్నమైన విద్యార్థులు.. శనివారం చివరి పరీక్ష ముగిసిన వెంటనే రీలాక్స్ అయ్యారు. పరీక్ష కేంద్రం నుంచి బయటకు వచ్చిన వెంటనే కేరింతలు కొడుతూ సందడి చేశారు.

కొత్తగూడెం ఎడ్యుకేషన్: కొత్తగూడెంలో విద్యార్థులను పరిశీలించి పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తున్న పోలీసు సిబ్బంది

సమాజంలో గౌరవప్రదంగా జీవించాలి

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి

కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెం టౌన్, మార్చి 30: సమాజంలో ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లు గౌరవప్రదంగా జీవించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి సూచించారు. వారి హక్కులు, సంరక్షణ కోసం ప్రభుత్వాలు ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయని వివరించారు. స్థానిక సెక్యూర్ ఎన్‌జీవో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. ఎన్‌జీవో ప్రాజెక్టు మేనేజర్ రాజేంద్రప్రసాద్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పురుషోత్తంరావు, నిరంజన్‌రావు, జ్యోతి విశ్వకర్మ, నాగస్రవంతి, న్యాయవాది రాజమల్లు పాల్గొన్నారు.

శరణాలయాన్ని సజావుగా నిర్వహించాలి..

మున్సిపాలిటీ పరిధిలోని బూడిదగడ్డలో ఉన్న శ్రీస్నేహలత సంధ్యలత పిల్లల అనాథ శరణాలయాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న కనీస సౌకర్యాలు గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. శరణాలయాన్ని సజావుగా నిర్వహించాలని సూచించారు.

తనిఖీల్లో రూ.7 లక్షలు సీజ్

భద్రాచలం, మార్చి 30: భద్రాచలం పట్టణంలోని కూనవరం రోడ్డులోగల ఎన్నికల చెక్ పోస్ట్ వద్ద శనివారం ఓ వ్యక్తి నుంచి రూ.7.23 లక్షలను పోలీసులు స్వాధీనపర్చుకుని సీజ్ చేశారు. తన గొర్రెలను జార్ఖండ్‌లో అమ్మి డబ్బుతో వస్తున్నట్లు ఆ నగదుగల వ్యక్తి చెప్పారు.

రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

భద్రాచలం, మార్చి 30: భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం అంతరాలయంలోని మూలవరులకు అర్చకులు శనివారం స్వర్ణ తులసి పూజలు చేశారు. నిత్య కల్యాణ మూర్తులకు బేడా మండపంలో శాస్త్రోక్తంగా నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణ దాతలకు ప్రసాదాలు అందజేశారు.

గొత్తికోయ గ్రామం సందర్శన

పర్ణశాల, మార్చి 30: వలస గొత్తికోయలు నివసిస్తున్న మండలంలోని మానుగట్టు గ్రామాన్ని ఎంపీడీవో ఈదయ్య, ఎంపీవో ముత్యాలరావు శనివారం సందర్శించారు. నీటి సమస్యపై ఆరా తీశారు. సోలార్ మోటర్ ద్వారా నీరు ఇంటింటికీ అందుతున్నదని, అయినప్పటికీ ఒక చేతి బోరు కావాలని గ్రామస్తులు కోరారు. అధికారులు అంగీకరించారు.

వలస కూలీలకు సరుకుల పంపిణీ

కొత్తగూడెం టౌన్, మార్చి 30: సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ జిల్లా ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో అంతర్‌రాష్ట్ర వలస కూలీలకు శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఖాసీం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉమెన్స్ గిల్డ్ బాధ్యులు పాల్గొన్నారు.

మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

కొత్తగూడెం అర్బన్, మార్చి 30: తెలంగాణ ఆటోడ్రైవర్స్ యూనియన్ (టాడు) కొత్తగూడెం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పరీక్షలకు హాజరైన విద్యార్థులు, ఎండలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు, వ్యాపారులకు మజ్జిగ అందించారు.

'ర్యాంపు ప్రారంభించొద్దు'

సారపాక, మార్చి 30: తమ అనుమతులు లేకుండా తమ గ్రామంలో మరోసారి ఇసుక ర్యాంపు ప్రారంభించొద్దని మండలంలోని మోతె గ్రామస్తులు డిమాండ్ చేశారు. తమ గ్రామంలో రెండోసారి ఇసుక ర్యాంపు ప్రారంభిస్తామని అధికారులు అంటున్నారని అన్నారు. అయితే గ్రామస్తుల కుగానీ, సొసైటీ సభ్యులకుగానీ తెలియకుండా ర్యాంపును ప్రారంభిస్తే ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ మేరకు శనివారం గ్రామంలో ఆందోళన నిర్వహించారు. తమకు సమాచారం ఇవ్వకుండా తమ ఇసుక ర్యాంపు ప్రారంభిస్తుండడం ఏంటని ప్రశ్నించారు.

దుస్తుల అందజేత

చర్ల, మార్చి 30: మండలంలోని పూజారి గూడెం, లెనిన్ కాలనీ, సింగసముద్రం గ్రామాల్లోగల జీఎస్ఎస్ చైల్డ్ డే కేర్ సెంటర్లలోని పేద విద్యార్థులకు గ్రేస్ సర్వీస్ సంస్థ బాధ్యులు శనివారం దుస్తులు పంపిణీ చేశారు.

పాల్వంచ రూరల్, మార్చి 30: మండలంలోని కిన్నెరసాని ఇక్రా అరేబియా దారుస్సలాం ముస్లిం ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు పాల్వంచకు చెందిన సామాజిక కార్యకర్త, శ్రీ మోక్ష వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్ శనివారం 25 కిలోల బియ్యాన్ని వితరణ ంచేశారు.

టేకులపల్లి, మార్చి 30: రంజాన్ పండుగ సందర్భంగా బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో పేద ముస్లిం కుటుంబాలకు దుస్తులు పంపిణీ చేశారు. శనివారం టేకులపల్లి మండలం బేతంపూడి దర్గాలో కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ సందర్భంగా పేదలకు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు అనంతరం 30 కుటుంబాలకు దుస్తులు అందజేశారు.

నట్టేట ముంచిన నకిలీ విత్తనాలు

మండలంలో 50 ఎకరాల్లో పంట నష్టపోయిన రైతులు

ఎండిపోయిన మొక్కజొన పంటను చూపిస్తున్న రైతులు

ఆళ్లపల్లి, మార్చి 30: మండలంలోని పలువురు రైతులను విత్తనాల డీలర్లు నట్టేట ముంచారు. వారు అంటగట్టిన నకిలీ విత్తనాలు వేయడంతో పంటనంతా నష్టపోయామంటూ గోడు వెళ్లబోసుకుంటున్నారు. రైతుల కథనం ప్రకారం.. ఆళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన రైతులు కొమ్మ శ్రీను, గుండెబోయిన రామకృష్ణ, నాతి దుర్గేశ్, పరమ రమేశ్, బట్టు సురేశ్ అనే రైతులు సుమారు 50 ఎకరాల్లో యాసంగి మొక్కజొన్న సాగు ప్రారంభించారు. డీలర్ల దగ్గర విత్తనాలు తెచ్చి నాటారు. మొదట్లో పంట మంచిగానే కన్పించింది. కానీ కంకి వేసే సమయానికి చేను ఎత్తు ఎదగడం లేదు. పైగా మొక్కలన్నీ ఎండిపోవడం ప్రారంభించాయి. గతంలో ఇదే పంటను సాగు చేసినప్పుడు ఇదే కాలంలో మొక్కజొన్న పంట మంచిగా ఎదిగేది. తగిన పరిమాణంలో కంకులు వేసేవి. కానీ ఈసారి ఇందుకు భిన్నంగా జరిగింది. పంటలో ఎదుగుదల లేదు. కంకులు వేయడం లేదు. పైగా పంట మొత్తం ఏకబిగిన ఎండిపోతోంది. దీంతో నకిలీ విత్తనాల వల్లనే తాము మోసపోయామని గమనించి రైతులు.. శనివారం మండలంలోని మీడియా ప్రతినిధులకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఎండిపోయిన తమ పంటలను చూపించారు.

అశ్వారావుపేట సొసైటీ నిర్లక్ష్యంపై విచారణ

'నమస్తే తెలంగాణ' కథనానికి స్పందన

సొసైటీ నిర్లక్ష్యం.. రైతులకు శాపం

'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం

అశ్వారావుపేట, మార్చి 30: అశ్వారావుపేట సహకార సొసైటీ నిర్లక్ష్యంపై కలెక్టర్ ప్రియాంక ఆలా విచారణకు ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి ఖుర్షిద్.. సహాయ సహకార అధికారి ఏడుకొండలును విచారణాధికారిగా నియమించారు. ఆయన రెండు రోజుల పాటు అశ్వారావుపేట సొసైటీలో విచారణ నిర్వహించారు. బీమా చెల్లింపుల వివరాలు, ఉద్యోగుల వాగ్మూలాలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. మరణించిన రైతుల కుటుంబాలకు బీమా చెల్లింపుల విషయంలో 'సొసైటీ నిర్లక్ష్యం – రైతులకు శాపం' శీర్షికను 'నమస్తే తెలంగాణ' ఈ నెల 28న ఓ కథనాన్ని ప్రచురించింది. దీనికి స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించారు. అయితే, ప్రాథమిక విచారణ పూర్తయిందని, నివేదికను జిల్లా సహకార అధికారికి అందిస్తామని విచారణాధికారి ఏడుకొండలు శనివారం 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. పూర్తి స్థాయి విచారణ కొనసాగుతుందని చెప్పారు. ఇదిలా ఉండగా 'నమస్తే తెలంగాణ' వివరణ కోరిన వెంటనే సొసైటీ ఉద్యోగులు ఆందోళనతో బీమా క్లెయిములను సదరు కంపెనీకి పంపించినట్లు సమాచారం.

వ్యక్తి, తహసీల్దార్‌పై ఎంపీవో దుర్భాషలు

- బిల్డింగ్ నిర్మాణంపై యజమానితో ఎంపీడీవో ఫోన్ కాల్
- ప్రచార మాధ్యమాల్లో వైరల్ అవుతున్న ఆడియో రికార్డు

కరకగూడెం, మార్చి 30: కరకగూడెంలో ఓ వ్యక్తి నిర్మాణం చేపట్టిన బిల్డింగ్ విషయంలో ఇద్దరు అధికారుల మధ్య జరిగిన ఆడియో సంభాషణ మండలంలో వైరల్ అయింది. స్థానికుల సమాచారం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన రవి కొంతకాలం క్రితం బిల్డింగ్ నిర్మాణం చేపట్టాడు. ఈ విషయంలో ఎంపీవో, పంచాయతీ కార్యదర్శి విషయం తెలుసుకొని అనుమతులు లేవంటూ నిర్మాణాన్ని నిలిపివేశారు. అయితే తనకు అనుమతులున్నాయని, బిల్డింగ్ నిర్మాణానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సదరు రవి కోర్టులో కేసు వేశాడు. కేసు నడుస్తుండగా తిరిగి రవి కరకగూడెం తహసీల్దార్‌ను ఆశ్రయించాడు. అనంతరం బిల్డింగ్ నిర్మాణాన్ని మళ్లీ ప్రారంభించాడు. విషయం తెలుసుకున్న ఎంపీవో.. సదరు రవితో ఫోన్లో మాట్లాడారు. 'నిర్మాణానికి ఎవరు అనుమతులిచ్చారు? తహసీల్దార్ దగ్గరకు ఎందుకు వెళ్లావు' అని ప్రశ్నించారు. ఇదే క్రమంలో రవిని, తహసీల్దార్‌ను ఎంపీవో దుర్భాషలాడాడు. అయితే దుర్భాషలాడిన ఈ ఆడియో మండలంలో వైరల్ అయింది. ఈ విషయంపై ఎంపీవోను వివరణ కోరగా.. తహసీల్దార్ తనకు పరిచయం లేదని, ఆయనతో ఎప్పుడు మాట్లడలేదని సమాధానమిచ్చారు. ఇదే విషయమై తహసీల్దార్‌ను వివరణ కోరగా.. ప్రజలతోనూ, సహచర అధికారులతోనూ ఎలా మాట్లాడాలో ఎంపీవో తెలుసుకోవాలని సూచించారు.

సింగరేణి జీఎంలకు ఆత్మీయ సన్మానం

మణుగూరు టౌన్: ఎస్వోటూ జీఎంను సన్మానిస్తున్న నాయకులు

కొత్తగూడెం సింగరేణి, మార్చి 30: సింగరేణి హెచ్ఆర్‌డీ, టెక్నికల్ సర్వీసెస్‌లో జీఎంలుగా పనిచేసి ఆదివారం పదవీ విరమణ పొందనున్న జీఎంలను శనివారం సన్మానించారు. సింగరేణి ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో సీపీపీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం జీఎం హెచ్ఆర్‌డీ వెంకటేశ్వరరావు, జీఎం ఈఅండ్ఎం రామచంద్రమూర్తిలను డైరెక్టర్(పా) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్ (పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి సత్కరించి పుష్పగుచ్ఛాలు అందించారు. జీఎంలు బసవయ్య, జే.రమేశ్, రవికుమార్, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, హనుమంతరావు పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్వోటూ జీఎం..

మణుగూరు టౌన్, మార్చి 30: సింగరేణి మణుగూరు ఏరియా ఎస్వోటూ జీఎంగా ఇటీవల బాధ్యలు చేపట్టిన శ్యామ్‌సుందర్‌ను కార్మిక సంఘాల నాయకులు శనివారం సన్మానించారు.

సర్వసభ్య సమావేశానికి హాజరుకావాలి: ఎంపీడీవో

ఇల్లెందు రూరల్, మార్చి 30: మండల సర్వసభ్య సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరుకావాలని ఎంపీడీవో ధన్‌సింగ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 4న ఉదయం 10:30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ఏప్రిల్ 2న సాయంత్రం 3 గంటల్లోపు నివేదికలను తమ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

కార్మికులు జాగ్రతలు పాటించాలి: సింగరేణి డైరెక్టర్

గనిని పరిశీలిస్తున్న సత్యనారాయణ

టేకులపల్లి, మార్చి 30: బొగ్గు ఉత్పత్తి, రవాణాలో రోజువారీ లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి డైరెక్టర్ (ఈఎం) డీ.సత్యనారాయణ సూచించారు. అదే సమయంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉన్నందున కార్మికులు, ఉద్యోగులు తగిన జాగ్రతలు తీసుకోవాలని సూచించారు. సింగరేణి ఇల్లెందు ఏరియా కోయగూడెం ఓసీలో శనివారం పర్యటించిన ఆయన.. రోజువారీ బొగ్గు ఉత్పత్తి, రవాణా, ఓబీ బ్లాస్టింగ్, లోడింగ్ పనులను పరిశీలించారు. ఆయా అంశాల గురించి ప్రాజెక్ట్ ఆఫీసర్ వీ.శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. యాంత్రిక శక్తిని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవాలని సూచించారు. ఎస్ఓటూ డైరెక్టర్ కేవీ రావు, ఏరియా ఇంజినీర్ నరసింహరాజు, గని మేనేజర్ సౌరబ్ సుమన్, శివ శంకర్, రాజు, అంజిరెడ్డి పాల్గొన్నారు.

'ఉపాధి' పథకంలో మార్పులపై అవగాహన

దుమ్ముగూడెం, మార్చి 30: ఉపాధి హామీ పథకంలో వచ్చిన మార్పులపై సిబ్బందికి అధికారులు శనివారం అవగాహన కల్పించారు. ఎంపీడీవో అధ్యక్షతన మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఏపీవో, ఈసీ, ఎఫ్ఏలు, టీఏలు, సిబ్బంది హాజరయ్యారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన డీఎస్పీ

బూత్‌ను తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను

ఇల్లెందు రూరల్, మార్చి 30: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా ఇల్లెందు నియోజకవర్గంలోని అన్ని పోలింగ్ బూత్‌లను డీఎస్పీ చంద్రభాను పరిశీలించారు. శనివారం మండలంలోని 21ఫిట్, 24 ఏరియా, రొంపేడు, ముత్తారపు కట్ట, వీరాపురంలో పర్యటించారు. పోలింగ్‌స్టేషన్లలో కరెంటు సరఫరాతో పాటూ బౌండ్రీ వాల్స్ సరిగా ఉన్నాయా లేవా అనేది పరిశీలించారు.

ఎన్నికల బహిష్కరణకు మావోయిస్టుల పిలుపు

దుమ్ముగూడెం, మార్చి 30: పార్లమెంట్ ఎన్నికలను బహిష్కరించాలని మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పేరుతో శనివారం రేగుబల్లి ప్రధాన రహదారి పక్కన కరపత్రాలు కనిపించాయి. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య రేక విధానాలను అవలంబిస్తున్నదని, గత కాంగ్రెస్ పాలకులు కూడా ఇలాగే చేశారని కమిటీ విమర్శించింది.

లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా ఇల్లెందు వాసి

ఇల్లెందు, మార్చి 30: లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్‌గా ఇల్లెందు వాసికి అవకాశం దక్కింది. శనివారం హైదరాబాద్‌లోని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్ చైర్మన్‌గా ఇల్లెందుకు చెందిన మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకులు మిరియాల చంద్రమోహన్‌ను లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ ఎన్.మనోహర్‌రెడ్డి నియమించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

బూర్గంపహాడ్, మార్చి 30: మండలంలోని నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. మృతుడి కుమారుడు చెంచలపు శ్రీకాంత్ కథనం ప్రకారం.. శనివారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో చెంచలపు వెంకటేశ్వర్లు (48) కరెంట్ పని చేస్తుండగా ప్రమాదశాత్తు కరెంట్‌షాక్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ప్రథమ చికిత్స నిమిత్తం దగ్గరలోని ప్రైవేట్ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. మృత దేహాన్ని స్థానిక పోలీసులు బూర్గంపహాడ్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు కొత్తగూడెంలో ఏరువాక సాంస్కృతిక సభ

కొత్తగూడెం టౌన్, మార్చి 30: కొత్తగూడెంలోని టీచర్స్ భవన్‌లో ఈ నెల 31న జరిగే ఏరువాక సాంస్కృతిక సభను విజయవంతం చేయాలని సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (ఎస్ఎస్ఎఫ్) కొత్తగూడెం జిల్లా కమిటీ బాధ్యులు శనివారం ఒక ప్రకటనలో కోరారు.

'ఖాతాదారులు ఈ-కేవైసీ చేయించుకోవాలి'

పాల్వంచ, మార్చి 30: పోస్టాఫీసులు, పోస్టల్ బ్యాంకుల ఖాతాదారులు తమ ఖాతాలకు ఈ–కేవైసీ చేయించుకోవాలని సబ్ పోస్టు మాస్టర్ నంద్యాల ఉపేందర్ శనివారం ఒక ప్రకటన